తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం

సేవా కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ యెనుముల సుష్మ కేశవ రెడ్డి





మాచర్ల.నవంబర్ 27 రాజధాని వాయిస్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు అండగా నిలిచేందుకు మాచర్లలోని ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాచర్ల మున్సిపల్ చైర్మన్ యెనుముల సుష్మ కేశవ రెడ్డి ముఖ్యంగా హాజరై రక్తదాన శిబిరాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రక్తదానం అనేది ఎంతో విలువైన ప్రాణదానమని, మనం చేసే ఒక్క చిన్న సహాయం మరొకరి జీవితంలో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు క్రమం తప్పకుండా రక్తం అవసరమవుతుందని, అలాంటి చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.సామాజిక బాధ్యతతో నిర్వహించే ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని, రక్తదాతలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. తలసేమియా చిన్నారులకు అండగా నిలుస్తూ రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆమె అభినందించారు.

పాయకరావుపేట అభివృద్ధి బాధ్యత నాది హోంమంత్రి అనిత

కూటమి అభ్యర్థి జుర్రెడ్డి ప్రసాద్, వార్డు అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



పాయకరావుపేట. నవంబర్ 27రాజధాని వాయిస్ : పాయకరావుపేట పట్టణ సమగ్ర అభివృద్ధికి తాను పూర్తి బాధ్యత తీసుకుంటానని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈ నెల 29న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి జుర్రెడ్డి ప్రసాద్‌తో పాటు వార్డు అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు.గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆమె విస్తృతంగా ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. అడుగడుగునా ప్రజలు మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ, రెండున్నరేళ్ల కూటమి పాలనలో పట్టణంలో రూ.18 కోట్లతో ప్రధాన రహదారి, డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. గతంలో పంచాయతీ భవనానికి రూ.90 లక్షలు మంజూరు చేయించినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. పట్టణంలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, అంబేద్కర్ భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్ రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. మంచి నాయకుడైన జుర్రెడ్డి ప్రసాద్‌ను, వార్డు అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలు ఏవైనా ప్రజలంతా కూటమి వైపే మంత్రి డోలా

తూర్పు నాయుడుపాలెంలో మంత్రిని కలిసిన విజేతలు

తూర్పు నాయుడుపాలెం (ప్రకాశం).నవంబర్ 27రాజధాని వాయిస్ : ఎన్నికలు ఏవైనా ప్రజలంతా ఎన్డీఏ కూటమి వైపే ఉన్నారని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించిన పలువురు కూటమి అభ్యర్థులు శుక్రవారం తూర్పు నాయుడుపాలెంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. విజేతలను అభినందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఓటమి భయంతోనే ప్రతిపక్షం అరాచకాలకు పాల్పడుతోందని విమర్శించారు.వైసీపీ ఆవిర్భావంతో రాజకీయాల్లో నైతిక విలువలు, ఆ పార్టీ అనుకూల మీడియాతో విశ్వసనీయత పూర్తిగా పతనమయ్యాయని మంత్రి ఆరోపించారు. టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసి, తిరిగి తమపైనే దాడులు జరిగినట్లు తప్పుడు ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. ప్రజలు తిరస్కరిస్తున్నా వారి తీరులో మార్పు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇటువంటి అసత్య ప్రచారాలను మానుకోకపోతే ప్రజల చేతిలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మంత్రి డోలా హెచ్చరించారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

మాచర్ల అభివృద్ధికి సమష్టి కృషి చేయాలి చైర్‌పర్సన్ సుష్మా కేశవరెడ్డి



మాచర్ల.నవంబర్ 27 రాజధాని వాయిస్ : పట్టణ ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించడంతో పాటు, పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ యెనుముల సుష్మా కేశవరెడ్డి సూచించారు. శుక్రవారం మాచర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళా సంఘాల ఆర్పీలతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు అందించాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజారోగ్యం, మహిళా సంక్షేమం తదితర అంశాలపై సిబ్బందితో సమీక్షించారు. ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని చైర్‌పర్సన్ తెలిపారు. విధుల నిర్వహణలో బాధ్యత, సమయపాలన, ప్రజల పట్ల సేవాభావం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ, మహిళల ఆర్థిక అభివృద్ధికి సహకరించాలని తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని, మాచర్ల పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని చైర్‌పర్సన్ సుష్మా కేశవరెడ్డి పిలుపునిచ్చారు.

దుర్గి బుగ్గ వాగు డ్యాం కు చేరిన నీరు పరిసర ప్రాంత ప్రజల కళ్ళల్లో ఆనందం



దుర్గి. నవంబర్ 27 రాజధాని వాయిస్ : పల్నాడు ప్రజల తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ కుడి కాలువ నుండి గురువారం విడుదల చేసిన నీరు శుక్రవారం దుర్గి మండలంలోని బుగ్గవాగు డ్యాంకు చేరింది. వర్షాభావ పరిస్థితులతో బోర్లలో నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్న స్థానికులు,ఈ నీటి రాకతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ నీరు తాగునీటితో పాటు వ్యవసాయ అవసరాలకు కూడా ఎంతో ఉపయోగపడుతుందనిబావిస్తున్నారు.

తొమ్మిది గ్రామాల్లో తంగిరాల సౌమ్య ఎన్నికల ప్రచారం



నందిగామ, రాజధాని వాయిస్ : నందిగామ నియోజకవర్గంలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం చివరి రోజైన శుక్రవారం రాజకీయ సందడి నెలకొంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నాయకులతో కలిసి నందిగామ మండల పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. పెద్దవరం, అడవిరావులపాడు, పల్లగిరి, కమ్మవారిపాలెం, రాఘవాపురం, అంబారుపేట, కంచల, కేతవీరునిపాడు, చందాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులతో కలిసి ప్రజలను నేరుగా కలుసుకుని వారి మద్దతు కోరారు. ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల సమావేశాల్లో తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. కూటమి తరపున పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు తమ ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. అభ్యర్థులకు కేటాయించిన ఎన్నికల గుర్తులపై ఓట్లు వేసి మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. చివరి రోజు ప్రచారాన్ని తొమ్మిది గ్రామాలకు విస్తరించడం ద్వారా కూటమి అభ్యర్థులకు మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి కూటమి అభ్యర్థుల గెలుపు కీలకమని ఆమె తన ప్రచార ప్రసంగాల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేస్తూ స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని కూడా తంగిరాల సౌమ్య ప్రస్తావించారు. తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక అవసరాలను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలందించే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేసే ప్రతినిధులు అవసరమని ఆమె ప్రజలకు వివరించారు. చివరి రోజు ప్రచారంలో మండల జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు సమష్టిగా ప్రచారం నిర్వహించారు. తొమ్మిది గ్రామాల్లో జరిగిన పర్యటనలో ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలని తంగిరాల సౌమ్య విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారం ముగింపు దశకు చేరుకోవడంతో గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి నెలకొంది.

పల్లెల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం: ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



అద్దంకి / సంతమాగులూరు, రాజధాని వాయిస్ : పల్లెల సమగ్రాభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు అద్దంకి నియోజకవర్గ గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ నేతృత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు, పుట్టవారిపాలెం, పాతమాగులూరు గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, పార్టీ బలోపేతం, ఎన్నికల వ్యూహాలపై చర్చించారు. గ్రామాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సమావేశాల్లో డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, పల్లె ప్రగతి, మౌలిక వసతుల కల్పనతో పాటు సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో చిన్నపాటి సమస్యలు ఉన్నా నాయకులు సమన్వయంతో పరిష్కరించుకుంటూ ఐక్యతను చాటాలని సూచించారు. వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా సమష్టి కృషితో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సంతమాగులూరు మార్కెట్ యార్డు చైర్మన్ టి. రమేష్, గ్రామ ముఖ్య నాయకులు డి. గాలయ్య, దేవరపల్లి అంజిరెడ్డి, దేవంగి రాజు, నక్క వెంకటేశ్వర్లు, నక్క చిన్న సాంబయ్య తదితరులతో పాటు టీడీపీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, సంఖ్యలో పాల్గొన్నారు.

తుపాను నిరోధక విద్యుత్ వ్యవస్థకు కేంద్ర సాయం కోరిన మంత్రి గొట్టిపాటి

రూ.4,851 కోట్ల ప్రాజెక్టులో 90 శాతం నిధులు ఇవ్వాలని ఖట్టర్‌కు విజ్ఞప్తి



దిల్లీ.నవంబర్ 27 రాజధాని వాయిస్ : ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లో తుపానులను తట్టుకునేలా పటిష్ఠమైన విద్యుత్ పంపిణీ వ్యవస్థ నిర్మాణానికి సహకరించాలని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కేంద్రాన్ని కోరారు. శుక్రవారం దిల్లీలో జరిగిన రాష్ట్రాల విద్యుత్ మంత్రుల సమావేశం అనంతరం కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అర్నబ్, మురసు తుపాన్లతో రాష్ట్ర విద్యుత్ రంగానికి జరిగిన భారీ నష్టాన్ని వివరించిన గొట్టిపాటి భూగర్భ కేబుళ్లు, స్పన్‌పోల్స్ ఏర్పాటుకు రూ.4,851 కోట్లతో రూపొందించిన ప్రణాళికకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో 90 శాతం నిధులు కేంద్రం భరించాలని, మిగిలిన 10 శాతం వాటాను రాష్ట్రం భరిస్తుందని స్పష్టం చేశారు. నిధులు మంజూరైతే 2027-28 నుంచి 2029-30 వరకు మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామని, దీనివల్ల విపత్తుల సమయంలో నష్టాలు, సరఫరా అంతరాయాలు తగ్గుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రతిపాదనపై కేంద్ర మంత్రి ఖట్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ భేటీలో ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్ పాల్గొన్నారు. కాగా, సమావేశానికి హాజరైన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోనూ గొట్టిపాటి భేటీ అయి, తుపాను విపత్తు వేళ తెలంగాణ అందించిన సాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే కన్నా లక్ష్మినారాయణకు కృతజ్ఞతలు తెలిపిన నకరికల్లు సర్పంచ్



సత్తెనపల్లి.నవంబర్ 27రాజధాని వాయిస్: సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను నకరికల్లు గ్రామ నూతన సర్పంచ్ తిరువీధుల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నకరికల్లు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా తిరువీధుల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, పార్టీ బలోపేతంపై నాయకులు చర్చించారు.

నెమలిపురి సర్పంచ్ గా నల్లగొర్ల అన్నపూర్ణమ్మ ఏకగ్రీవ ఎన్నిక



రాజుపాలెం.నవంబర్ 27రాజధాని వాయిస్: మండలంలోని పెద నెమలిపురి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా నల్లగొర్ల అన్నపూర్ణమ్మ నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావు సహకారంతో గ్రామ సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ ప్రజలకు,నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, అందరినీ కలుపుకొని అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు



సత్తెనపల్లి.నవంబర్ 27 రాజధాని వాయిస్: ముప్పాళ్ళ మండలం, మాదల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి షేక్ నూరుల్లా మరియు వార్డు సభ్యుల గెలుపును కాంక్షిస్తూ సత్తెనపల్లి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి షేక్ నూరుల్లా, స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలతో కలిసి గ్రామం మొత్తం భారీ ర్యాలీగా తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు.గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి నూరుల్లాతో పాటు వార్డు మెంబర్లందరినీ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బొర్రా వెంకట అప్పారావు గ్రామ ప్రజలను కోరారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com